

భీమానాయక్ కుటుంబ సభ్యులతో ఏనుగుల రాకేశ్‌రెడ్డి

## సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ విఫలం

- ఉద్యమకారుల కుటుంబాలకు అండగా ఉంటా
- బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి

మహబూబాబాద్ రూరల్, మే 15: రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు చేయటంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ పట్టణంలోని తెలంగాణ ఉద్యమకారుడు, ఎల్‌హెచ్‌పీఎస్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ భీమానాయక్ కుటుంబ సభ్యులను గురువారం రాకేశ్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమకారుల కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని చెప్పారు. ప్రజా సమస్యలతోపాటు సామాజిక సేవా కార్యక్రమాలను భీమానాయక్ కుటుంబం నిర్వహించడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత గిరిజనుల సమస్యలను పట్టించుకోవటం లేదని, ఇంతవరకు లంబాడీలకు మంత్రి పదవి లేదని, విద్యాశాఖ మంత్రి లేక పాలన అస్తవ్యస్తంగా మారిందన్నారు. అనంతరం రాకేశ్‌రెడ్డిని భీమానాయక్ శాలువాతో ఘనంగా సత్కరించారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా యువజన అధ్యక్షులు యాళ్ల మురళీధర్ రెడ్డి, పురుషోత్తం, సంగెం భరత్, రాందాస్, శంకర్, రవి, వినయ్, చారి పాల్గొన్నారు.

*కాళ్లు కడిగించడం.. అవమానించడమే.. : ఏనుగుల రాకేశ్‌రెడ్డి*

కురవి: అందాల పోటీల కోసం వచ్చిన యువతుల కాళ్లు కడిగించడం తెలంగాణ మహిళలను అవమానించడమేనని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో రాకేశ్‌రెడ్డి పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలతో ప్రజలను మోసం చేసిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి బుద్ధి ప్రసాదించాలని స్వామి వారిని వేడుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నట్లు చెబుతున్న రేవంత్‌రెడ్డి ప్రపంచ అందాల పోటీలు పెట్టడం దేనికని ప్రశ్నించారు. అందాల పోటీల కోసం వచ్చిన యువతుల కాళ్లను కాకతీయులు ఏలిన ఓరుగల్లులో కడిగించడం సహించరాని నేరమన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు తోట లాలయ్య, యూత్ రాష్ట్ర నాయకులు గుగులోత్ రవినాయక్, నూతక్కి నరసింహారావు, మహబూబాబాద్ మార్కెట్ మాజీ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, సొసైటీ చైర్మన్ భిక్షంరెడ్డి, కురవి ఆలయ మాజీ చైర్మన్ బాదావత్ రాజునాయక్, పార్టీ గ్రామ అధ్యక్షుడు కొనతం విజయ్, యూత్ మండల అధ్యక్షుడు బానోత్ రమేశ్, గ్రామ మాజీ ఉపసర్పంచ్ సంగెం భరత్ కుమార్, తేజావత్ భోజునాయక్, నెహ్రూనాయక్, బండి యతిరాజు పాల్గొన్నారు.

## విదేశీ యువతుల కాళ్లు కడగడం దేనికి సంకేతం?

- బీఆర్ఎస్ యూత్ జిల్లా నాయకుడు తూళ్ల వివేక్

నెల్లికుదురు, మే 15: అందాల పోటీలకు వచ్చిన విదేశీ యువతుల కాళ్లు కడగడం దేనికి సంకేతమని బీఆర్ఎస్ యూత్ జిల్లా నాయకుడు తూళ్ల వివేక్ ప్రశ్నించారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాణీ రుద్రమదేవి, సమ్మక్క–సారలమ్మ, చాకలి ఐలమ్మ వంటి వీరవనితలు పుట్టిన ఓరుగల్లులో విదేశీ యువతుల కాళ్లు కడిగించిన సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ మహిళలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు నిర్వహించకపోవడంతో రైతులు వడదెబ్బతో పిట్టల్లా రాలిపోతుంటే సీఎంకు అందాల పోటీలు కావల్సి వచ్చిందా? అందాల పోటీలకు రూ.260కోట్ల ప్రజాధనం వృథా చేయడమే కాకుండా తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవాన్ని కించపరిచారని విమర్శించారు. ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ అమలు చేయకుండా కాలయాపన చేస్తూ డబ్బులు లేవంటూ సీఎం చేతులెత్తేశాడంటూ విమర్శించారు.

## ఇసుక అక్రమ రవాణా నివారణకు కందకాల తవ్వకం



బ్రాహ్మణకొత్తపల్లిలో కందకాలు తవ్విస్తున్న తహసీల్దార్ రాజు

నెల్లికుదురు, మే 15: ఆకేరువాగు నుంచి ఇసుక అక్రమ రవాణా నివారణ చర్యల్లో భాగంగా కందకాలు తవ్వించినట్లు తహసీల్దార్ కొడిచింతల రాజు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఆకేరువాగు నుంచి ఇసుకను తరలిస్తున్నారని, అరికట్టేందుకు రామన్నగూడెం, బ్రాహ్మణకొత్తపల్లి, రామోజీతండా, భగ్నతండా, మామిడితోట మొత్తం 7 ప్రదేశాల్లో జేసీబీలతో కందకాలు తవ్వించినట్లు వివరించారు. కందకాలను ఎవరైనా పూడ్చి తిరిగి ఇసుక రవాణా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

HOUSE FOR SALE

★Property for sale at Kishanpura near Chaitanya Degree College Hanamkonda, Warangal Urban Ground floor 2 BHK and 1 BHK with 2200 sq.ft, First & Second floor Slab laid 2200 sq.ft Each floor and Pent house 1030 sq.ft Slab laid Total square feets 7630. Per Sft. 4000/- negotiable Please Contact +91-7382963363. Location : 18°00'45.6"N 79°33'41.0" E (270 yards) STRICTLY NO BROKERS SERIOUS ENQUIRIES ONLY.

NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

# తొర్రూరులో పారిశుధ్య లోపం

- వార్డుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం
- డ్రైయినేజీల్లో ప్లాస్టిక్ బాటిళ్లు
- రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు
- ఇటీవల డెంగీతో ఇద్దరి మృతి
- అయినా పట్టించుకోని అధికారులు



అన్నారం రోడ్డులో ప్రవహిస్తున్న మురికినీరు



నిలిచిన మురుగునీటిలో ప్లాస్టిక్ బాటిళ్లు

తొర్రూరు, మే 15: తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం లోపించింది. అంతర్గత రోడ్లతోపాటు మెయిన్ రోడ్లలో ఎక్కడా చూసినా చెత్త పేరుకుపోయింది. మురుగు కాల్వలు శుభ్రం చేయకపోవడంతో నీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. మున్సిపాలిటీలో మొత్తం 16 వార్డులు ఉండగా, రోజూ సుమారు 60 టన్నుల చెత్త ఉత్పత్తవుతోంది. మున్సిపాలిటీలో 60 మంది పారిశుధ్య కార్మికులు ఉన్నారు. అయినా లోపలి కాలనీల్లో చెత్త సేకరణ సరిగా జరగడంలేదనే ప్రజలు అంటున్నారు. కాల్వల్లో చెత్తచెదారం, ప్లాస్టిక్ బాటిళ్లను తొలగించకపోవడంతో మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోందని చెబుతున్నారు. మురుగునీరు నిలిచినచోట ఆయిల్ బాల్స్ వేయడం, కిరోసిన్ పోయడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటివి మున్సిపాలిటీ చేయడంలేదని, దీంతో దోమలు పెరిగి జ్వరాలు వస్తున్నాయని వాపోతున్నారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించడంలేదని ప్రజలు ఆగ్రహిస్తున్నారు.

*గతంలో ప్రబలిన డెంగీ*

మున్సిపాలిటీలో పారిశుధ్య లోపం ప్రజలకు శాపంగా మారింది. విషజ్వరాలు ప్రబలుతున్నా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇటీవల ఇద్దరు డెంగీతో మృతి చెందారు. 12వ వార్డుకు చెందిన చిన్నారి గూబ హద్వీక, 13వ వార్డ్‌కు చెందిన బీటెక్ విద్యార్థి బేతుమల్ల ప్రేమ్‌కుమార్(23) చనిపోయారు. దీంతో ప్రజల్లో తీవ్ర భయాందోళన నెలకొంది. వానాకాలం రాకముందే మున్సిపాలిటీలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

*వారానికోసారి 'భగీరథ' నీరు*

మున్సిపాలిటీలో నీటి సమస్య ప్రజలను వేధిస్తోంది. ఐదు నుంచి ఏడు రోజులకోసారి మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతుండటంతో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి పట్టణంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచడంతోపాటు అన్ని వార్డులకు తాగునీటిని సరఫరా చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

- కురిసిన అకాల వర్షం
- బలమైన గాలుల బీభత్సం



గుండ్లబోడు తండాలో తడిసిన ధాన్యం

మహబూబాబాద్ రూరల్, మే 15 : మండలంలో శనిగపురం, సోమ్లాతండా, గుండ్లబోడు, ఇతర ప్రాంతాల్లో గురువారం సాయంత్రం బలమైన గాలులతో కూడిన వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వడ్లను రక్షించుకునేందుకు పరుగులు పెట్టి పట్టాలు తెచ్చి కప్పారు. శనిగపురం వడ్ల సెంటర్‌లో రైతులు ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయ్యాయి. సెంటర్ల నిర్వాహకులు నిర్లక్ష్యం వల్లే వడ్లు తడిశాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.



*20 రోజులైనా కాంటా పెట్టలే..*

కొనుగోలు కేంద్రానికి వడ్లు తెచ్చి 20రోజులైనా కాంటాలు పెట్టలే. ఐకేపీ సెంటర్ల నిర్వాహకులు నిర్లక్ష్యం వహించి, ఆలస్యం వల్లే వానకు వడ్లు తడిశాయి. అధికారులు కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయటం లేదు. రైతులు ఆగమవుతున్నా ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉంది. త్వరగా కాంటాలు పెట్టి రైతులను ఆదుకోవాలి. – *బానోత్ నవీన్‌నాయక్, రైతు*

## కేసముద్రంలో కూలిన వృక్షం

కేసముద్రం: మండల కేంద్రంలో గురువారం బలమైన గాలులు, అకాల వర్షంతో భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా కూలింది. చాలా ఏళ్ల నాటి ఈ భారీ వృక్షం విరిగి విద్యుత్ స్తంభాలపై పడడంతో రెండు స్తంభాలు విరిగాయి. అంబేద్కర్ సెంటర్ సమీపంలో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో చెట్టు విరిగిపడిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. రాకపోకలకు అంతరాయం కలిగింది. విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి చెట్టును తొలగించారు. మబ్బులు ఉండడంతో కొనుగోలు కేంద్రంలోని ధాన్యంపై రైతులు పరదాలతో కప్పుకున్నారు.




గాలికి విరిగి రోడ్డుకు అడ్డంగా పడిన భారీ వృక్షం

## గోవులను అక్రమ రవాణా చేస్తే చర్యలు

*రూరల్ సీఐ సర్వయ్య*

మహబూబాబాద్ రూరల్, మే 15 : గోవులను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని రూరల్ సీఐ సర్వయ్య హెచ్చరించారు. గురువారం మండలంలోని కంబాలపల్లి గ్రామంలో బక్రీద్ పండుగ నేపథ్యంలో పోలీసుల ఆధ్వర్యంలో చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేశారు. అనుమతులు లేకుండా గోవులను రవాణా చేయొద్దని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు ఉంటాయని సీఐ అన్నారు. కార్యక్రమంలో ఎస్సై దీపికారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ వీరన్న, కానిస్టేబుల్స్ విజయ్, బాలరాజు, సోమల్లు, సురేష్ పాల్గొన్నారు.

## భజన తండాలో తాటిచెట్టుపై పిడుగు



తాటిచెట్టుపై పిడుగుపడి చెలరేగుతున్న మంటలు

మరిపెడ, మే 15: తాటిచెట్టుపై పిడుగు పడి మంటలు చెటరేగి పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటన మండలంలో భజనతండాలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. గురువారం సాయంత్రం బలమైన గాలులతో కూడిన వర్షం కురిసింది. తండాలోని గుగులోత్ సాయిరాం చేనులో ఉన్న తాటిచెట్టుపై పిడుగు పడి కాలిపోయింది.

*జామాయిల్ చెట్లు దగ్ధం*

దంతాలపల్లి: మండలంలోని దాట్ల గ్రామం వ్యవసాయ భూమిలో జామాయిల్ చెట్లకు నిప్పంటుకొని దగ్ధమైన ఘటన మండలంలో గురువారం సాయంత్రం జరిగింది. బాధితుడి కథనం ప్రకారం.. గ్రామానికి చెందన పేర్ల మద్దయ్యకు చెందిన నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో జామాయిల్ చెట్లు పెంచుతున్నాడు. ప్రమాదవశాత్తు ఆ చెట్లకు నిప్పంటుకొని మంటలు చెలరేగాయి. గాలి వేగంగా వీచడంతో మంటలు పెరిగి చెట్లు కాలి బూడిదైనట్లు బాధితుడు తెలిపాడు.

## గాలివాన బీభత్సం



దంతాలపల్లిలో రోడ్డుపై గాలి దుమారానికి విరిగి పడిన చెట్టు

దంతాలపల్లి: ఎండ, వేడితో ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడగా గురువారం రాత్రి ఒక్కసారిగా వచ్చిన గాలివాన బీభత్సం సృష్టించింది. దంతాలపల్లిలో భారీ వర్షం కురవడంతో కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసి రైతులు ఇబ్బందులు పడ్డారు. వరంగల్ – ఖమ్మం ప్రధాన రహదారిపై చెట్లు విరిగి పడి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. సెయింట్ మేరీస్ పాఠశాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. ఎస్సీ కాలనీలో విద్యుత్ తీగలు తెగి కిందపడడంతో విద్యుత్ సరఫరా నిలివేశారు.

## గ్రామ సభల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలి

మహబూబాబాద్ రూరల్, మే 15 : గ్రామ సభల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్ అన్నారు. గురువారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి అనంతరం మాట్లాడారు. సమాచార హక్కు చట్టం ప్రజా ఫిర్యాదులపై పౌరులకు పౌర సమాచారాన్ని సులభతరం చేయాలన్నారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించే అధికారాలు, పంచాయతీరాజ్ చట్టం అంశాల పై మరింత పరిజ్ఞానం కోసం ఈ శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపీడీవోలు, విలేజ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ఆవులు మృతి




విద్యుఘాతంతో మృతి చెందిన ఆవు వద్ద రైతు



ఈనెల 8న మృతిచెందిన ఆవు (ఫైల్)

నెల్లికుదురు, మే 15: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో వారంరోజుల్లో రెండు ఆవులు మృత్యువాత పడ్డాయి. మండలంలోని హనుమాన్‌నగర్ గ్రామ పంచాయతీ పరిధి ధాన్యాతండా – సపావత్ తండా శివారులోని వ్యవసాయ పొలాల బావులు, బోర్లకు విద్యుత్‌ను సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. సంబంధిత ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉన్నప్పటికీ విద్యుత్ అధికారులు ఫెన్సింగ్ ఏర్పాటు చేయలేదు. ఫలితంగా వారం రోజుల్లో రెండు ఆవులు మృతిచెందాయి. మండలంలోని నైనాలకు చెందిన ఆకుల లింగయ్య ఆవు గురువారం మేతకు వెళ్లి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. దీంతో రూ.80వేల ఆర్థిక నష్టం జరిగిందని అతడు తెలిపాడు. ఈనెల 8న అదే ట్రాన్స్‌ఫార్మర్‌ను తగిలి ధాన్యాతండాకు చెందిన రైతు భూక్యా కిషన్ ఆవు విద్యుఘాతంతో మృతిచెందింది. దాని విలువ సుమారుగా రూ.80వేలు ఉంటుందని తెలిపాడు. గతంలో అదే ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేస్తుండగా సపావత్ మంగ్యా మృతిచెందాడు. ఇంత జరుగుతున్నా విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తండావాసులు, గ్రామ రైతులు ఆరోపిస్తున్నారు.

## సీఏ డబ్బులు వాడుకుందని ఆందోళన



ఆందోళన చేస్తున్న ఝాన్సీ గ్రూప్ సభ్యులు

కేసముద్రం, మే 15: సీఏ డబ్బులు సొంతానికి వాడుకుందని మండలంలోని కోరుకొండపల్లికి చెందిన ఝాన్సీ మహిళా గ్రూప్ సభ్యులు గురువారం స్త్రీశక్తి భవనం ఎదుట ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ కొన్నేళ్ల క్రితం బ్యాంక్ ద్వారా రూ.10లక్షల రుణం తీసుకున్నారు. అందులో నుంచి సీఏ రూ.లక్ష లోన్ తీసుకోగా మిగతా డబ్బులు గ్రూప్ సభ్యులు తీసుకున్నారు. నెల నెల చెల్లించే డబ్బులను సీఏకు ఇవ్వగా బ్యాంక్‌లో జమ చేయలేదు. లోన్ డబ్బులు చెల్లించడం లేదని బ్యాంక్ అధికారులు ఇటీవల తెలపడంతో సీఏను నిలదీయగా సొంతానికి వాడుకున్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. ఈ డబ్బులను ఇప్పించాలని ఆందోళన చేస్తున్నట్లు ఝాన్సీ గ్రూప్ సభ్యులు తెలిపారు.

# కొనుగోలు కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలి

**కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్**



వంతడపల కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

నర్సింహులపేట, మే 15: వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశించారు. గురువారం మండలంలోని వంతడపల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు ప్రక్రియ సజావుగా జరుగుతుందా? అని రైతును తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని సూచించారు. కొనుగోలు పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలన్నారు. రైతులందరికీ ఇబ్బందులు లేకుండా మద్దతు ధర లభించేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరబహ్మాచారి ఉన్నారు.

*దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి*


దంతాలపల్లి: భూ భారతి రెవెన్యూ సదస్సులో రైతులు చేసుకున్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ తెలిపారు. మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన భూ భారతి దరఖాస్తుల పరిశీలన కేంద్రాన్ని గురువారం కలెక్టర్ పరిశీలించారు. ప్రతి దరఖాస్తును పరిశీలించి సమస్యను పరిష్కరించేలా చూడాలన్నారు. దరఖాస్తుల పరిశీలను వివరాలను అడిగి తెలుసుకున్నారు. అడిషనల్ కలెక్టర్ బ్రహ్మాచారి, తహసీల్దార్ సునీల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఆఫీస్ సబార్డినేట్‌కు తీవ్రగాయాలు

కురవి, మే 15: రోడ్డు ప్రమాదంలో తహసీల్దార్ కార్యాలయంలోని ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న బొడ్డు రాంబాబుకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన కురవి శివారులో ఖమ్మం జాతీయ రహదారి–365/ఏపై ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల ఎదుట గురువారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. రాజోలుకు చెందిన బొడ్డు రాంబాబు తన బైక్‌పై ఖమ్మం రోడ్డు నుంచి కురవి వైపు వస్తున్నాడు. అదే మార్గంలో ఖమ్మం నుంచి కురవి వైపు గ్రానైట్‌ను తరలించే ఖాళీ లారీ వస్తోంది. ఈ క్రమంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల ఎదురుగా లారీ, బైక్ ఒకే మార్గంలో పక్కకు తగిలాయి. దీంతో బైక్‌పై నుంచి రోడ్డు పక్కకు రాంబాబు ఎగిరి పడిపోవడంతో తలకు తీవ్రగాయమై చెవులు, ముక్కు, నోటి నుంచి రక్తస్రావమైంది. స్థానికులు ఆటోలో మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగానే ఉన్నట్లు తోటి ఉద్యోగులు తెలిపారు. లారీ డ్రైవర్ వెంటనే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లారీని అప్పగించాడు. బైకు స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని ఏఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు.

## విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం

**డీఈఈ పెరుమాండ్ల విజయ్**



గ్రామస్తులతో డీఈఈ విజయ్

కురవి, మే 15: మండలంలోని బలపాల గ్రామంలో విద్యుత్ శాఖ డీఈఈ పెరుమాండ్ల విజయ్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. గ్రామంలో ప్రాథమిక పాఠశాల, ఎస్సీ కాలనీ సందర్శించి అక్కడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మిడిల్‌పోల్స్, కొత్త ట్రాన్స్‌ఫార్మర్, పాఠశాలలో స్తంభం తదితర పనులు యుద్ధప్రాతిపదికన చేయిస్తామని హామీ ఇచ్చారు. బంచరాయిలో విద్యుత్ వైర్లు అపహరణకు గురికాగా, సందర్శించి విద్యుత్ వైర్లు దొంగిలిస్తే క్రిమినల్ కేసులు అవుతాయని హెచ్చరించారు. అంబేద్కర్ కమిటీ హాల్ వరకు విద్యుత్ స్తంభాల ఏర్పాటు, రోడ్డు మధ్యలో ఉన్న ఇనుప స్తంభాలు తొలగిస్తామని చెప్పారు. ఏఈఈ శారద, లైన్‌మన్ కపిల్, గణేశ్, ఉప్పలయ్య, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం తెలుకుంట్ల సునీత పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లపై జడ్పీ సీఈవో సమీక్ష

డోర్నకల్, మే 15: ఇందిరమ్మ ఇళ్లపై జడ్పీ సీఈవో పురుషోత్తం గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల స్పెషల్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. మున్సిపాలిటీలో, గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ ఇళ్లపై సమగ్ర సమాచారం తెలుసుకున్నారు. రాజీవ్ యువ వికాసం పథకంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో శ్రీనివాస రావు, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, ఇందిరమ్మ ఇళ్ల స్పెషల్ ఆఫీసర్లు నాగేశ్వరరావు, నాగరాజు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పంపిణీ చేయాలి

తొర్రూరు, మే 15: పట్టణంలోని గోపాలగిరి రోడ్డులో నిర్మించిన 240 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను అర్హులైన నిరుపేదలకు తక్షణమే కేటాయించాలని సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి, జిల్లా కమిటీ సభ్యుడు మహమ్మద్ యాకుబ్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మార్క సాంబయ్య మాట్లాడారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించడంలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ఇండ్లను తక్షణమే పంపిణీ చేయాలని కోరారు. సీపీఎం మండల కమిటీ సభ్యుడు డోనక దర్గయ్య, సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి జమ్ముల శ్రీనివాస్, కమిటీ సభ్యుడు రవి, శ్రీలత, శోభ, వరలక్ష్మి, షమీనా, శ్రీరామ్ భద్రయ్య పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, ప్రజలు

## ఉత్తమ విద్యార్థినులకు సత్కారం

పెద్దవంగర, మే 15: ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన పద్మశాలి విద్యార్థులను గురువారం పద్మశాలి సంఘ నాయకులు సత్కరించారు. మండలంలోని గంట్లకుంటకు చెందిన విద్యార్థిని చింతకింది కావ్య ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 467 మార్కులు, చింతకింది స్పందన ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో 992 మార్కులు సాధించారు. దీంతో మండల పద్మశాలి సంఘం నాయకులు వారితోపాటు తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘ జిల్లా నాయకుడు పెండం రమేశ్ మాట్లాడుతూ పద్మశాలి కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. పద్మశాలి సంఘ నాయకులు రాపోలు శ్రీనివాస్, ఎనగందులు సంతోష్, ఎనగందుల స్వామి, చింతకింది ప్రసాద్, ఆంజనేయులు, ఉప్పలయ్య పాల్గొన్నారు.



విద్యార్థిని సన్మానిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

## రౌడీషీటర్లకు డీఎస్పీ కౌన్సెలింగ్



మాట్లాడుతున్న తొర్రూరు డీఎస్పీ కృష్ణకిశోర్

తొర్రూరు, మే 15: తొర్రూరు సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు గురువారం తొర్రూరు డీఎస్పీ కృష్ణకిశోర్ కౌన్సెలింగ్ నిర్వహించారు. కొన్నేళ్లుగా సత్ప్రవర్తనతో ఎలాంటి క్రిమినల్ కార్యకలాపాల్లో లేని కొందరి రౌడీషీట్లు, సస్పెక్ట్ షీట్లను పరిశీలించి ఎస్పీ రామ్‌నాథ్ కేకన్ ఆదేశాలతో తొలగించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మంచి ప్రవర్తన కలిగి ఉంటే సమీక్షించి భవిష్యత్‌లో రౌడీషీట్లు తొలగిస్తామని చెప్పారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలాంటి ఉద్రిక్తతలు లేకుండా, శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరగాలని కోరారు. కార్యక్రమంలో తొర్రూరు సీఐ టౌటం గణేశ్, సర్కిల్ ఎస్సైలు ఉపేందర్, రమేశ్‌బాబు, రాజు, సురేష్, క్రాంతికిరణ్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు వాకర్స్ సన్మానం

మహబూబాబాద్ రూరల్, మే 15 : పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను పట్టణంలో ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా పరీక్షల ఇన్‌చార్జి శ్రీరాములు మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం, ఉపాధ్యాయుల కృషి వల్లే పదో తరగతిలో ఫలితాలలో జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. సదానందం, సుధాకర్, రవీంద్రగుప్తా, కృష్ణమూర్తి, శ్రీనివాస్, రాజు, వెంకటరెడ్డి, మైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## సమ్మెను జయప్రదం చేయండి

మరిపెడ, మే 15: దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు ఈనెల 20న చేపట్టే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి గుండ గాని మధుసూదన్ పిలుపునిచ్చారు. గురువారం పురపాలక సంఘం పరిధిలో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కార్మికులకు సమ్మె చేసే హక్కు, ప్రశ్నించే హక్కు, ఉద్యోగ భద్రత హక్కు, జీతాలు పెంచుకునే హక్కుతోపాటు అన్ని విధాలా హక్కులను సవరణకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు బాణాల రాజన్న, బోడపట్ల రాజశేఖర్, కందాల వెంకన్న, మల్సూరు, గోపాల్, నరేష్, రమేశ్, మధుసూదన్ పాల్గొన్నారు.

## రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

నర్సింహులపేట, మే 15: ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తహసీల్దార్ నాగరాజు గురువారం తెలిపారు. మండలంలోని ఫకీరతండా శివారు ఆకేరువాగు నుంచి బుధవారం రాత్రి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు సమాచారంతో రెవెన్యూ సిబ్బంది పోలీసుల సహకారంతో దాడి చేసి రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్లను పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

## బ్రిడ్జి నిర్మించే వరకు పోరాటం ఆగదు

కురవి, మే 15: మండలంలోని బేగావత్ తండా జీపీలో గ్రీన్‌ఫీల్డ్ హైవేపై బ్రిడ్జి నిర్మించే వరకు పోరాటం ఆగదని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మాలోత్ కిషన్‌నాయక్ అన్నారు. గురువారం తండాలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మించకపోవడంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తండావాసులు కర్నావత్ నాగరాజు, బేతావత్ బాలాజీ, రవి, శంకర్, మోహన్, వినోద్, విజేందర్, భగవాన్‌దాస్, వాల్య, శ్రీను, భూక్య దీప్లా, జర్పుల రామోజీ పాల్గొన్నారు.

## మత విద్వేషాలను రెచ్చగొట్టడాన్ని తిప్పికొట్టాలి

కురవి, మే 15: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొట్టడాన్ని ప్రతిఘటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బీ విజయ్ సారథి అన్నారు. సీపీఐ కురవి మండల 9వ మహాసభలు మండలంలోని అయ్యగారిపల్లిలో ఆ పార్టీ సీనియర్ నాయకుడు నల్లు అమృతారెడ్డి ఎర్ర జెండాను ఎగురవేయగా బుర్ర సమ్మయ్య, బొల్లం ఉప్పలయ్య అధ్యక్షత వహించగా ఆయన మాట్లాడుతూ పూటకో పార్టీ మార్చుతూ అధికారం ఎక్కడ ఉంటే అక్కడ వాలే రాజకీయనాయకులకు బుద్ధి చెప్పాలన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి మండల నూతన కార్యదర్శిగా కరణం రాజన్న, సహాయ కార్యదర్శిగా బుర్ర సమ్మయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నెల్లూరు నాగేశ్వరరావు, దొంతు రామమూర్తి, బొల్లు వెంకన్న, తురక రమేశ్, కలగూర నాగరాజు, నరసింగం గురువయ్య, బస్వ కొమరయ్య, రామగోని రవి, దూదికట్ల సారయ్య పాల్గొన్నారు.